క్లుప్తంగా

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి



దుగ్గిరాల: వేసవిలో ఉపాధి హామీ కూలీలకు కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వడం లేదని కూలీలు వాపోయారు. మండలంలోని ఈమనిలో గుంటూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సి.పి.ఎం నాయకులు జెట్టి బాలరాజు మంగళవారం కూలీలతో మాట్లాడారు. మంచి నీళ్లు, మజ్జిగ వంటివి గతంలో ఇచ్చేవారని.. ఇప్పుడు ఇవ్వడంలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. వారి వేతనాలు కూడా సకాలంలో చెల్లించడంలేదని, పనిముట్లు పదును పెట్టడానికి గతంలో కొంత డబ్బు ఇచ్చే వారని.. అవి కూడా ఇప్పుడు ఇవ్వడంలేదని అన్నారు. కనీసం నెల రోజులు కూడా పని కల్పించకుండా ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని కూలీలు వాపోయారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని బాలరాజు అన్నారు. కార్యక్రమంలో ఎం.చెంచురాజు, సత్యనారాయణ, కృష్ణమూర్తి, శివ పాల్గొన్నారు.

ప్రధాని సభ జనసమీకరణపై ఏర్పాట్లు



దుగ్గిరాల: ప్రధాని అమరావతికి రానున్న నేపథ్యంలో జనసమీకరణపై దుగ్గిరాలలోని జంపాల కాంప్లెక్స్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవి కుమార్, తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తల ద్వారా 3000 మంది ప్రజలకి 60 బస్సులు.. డి.ఆర్.డి.ఎ ద్వారా 1100 మంది ప్రజలకు 22 బస్సులు కేటాయించామని అన్నారు. వేసవి దృష్ట్యా ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్.జబీన్, కె.అనిత, జి.వెంకట్రావు, వెనిగెళ్ల కృష్ణ ప్రసాద్, కె.ముత్తయ్య, వి.ఝాన్సీ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై విత్తనాలు

పెదవడ్లపూడి(మంగళగిరి): నగర పరిధిలోని పెదవడ్లపూడి, చినవడ్లపూడి గ్రామాల రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు, పనిముట్లను పంపిణీ చేసింది. మార్కెట్ యార్డు చైర్మన్ జువ్వాది కిరణ్ చందు రైతులకు పనిముట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి శైలజారాణి, రాష్ట్ర సివిల్ సప్‌లెస్ డైరెక్టర్ తోట పార్థసారధి పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిషుపై శిక్షణ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలీ శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషులో శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయుడు రాజు పాల్గొని విద్యార్థులకు గ్రామర్, పదాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి పి.జేమ్స్, కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపు తప్పి.. పక్కకు ఒరిగి!



తాడేపల్లి రూరల్: కంకర లోడ్‌తో వెళుతున్న లారీ మంగళవారం ఉండవల్లి వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పింది. సేకరించిన వివరాల ప్రకారం.. ఉండవల్లి సెంటర్ నుంచి రాజధాని అమరావతి వైపు కంకర లోడ్‌తో వేగంగా లారీ వెళుతుంది. ఉండవల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న ఇంటి మీదకు దూసుకుపోయింది. మితిమీరిన వేగమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు అంటున్నారు. నిత్యం ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని.. అధికారులు స్పందించిన రోడ్డు విస్తరణ చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా.. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

కాలువలో మురుగు.. సాగునీరు కరువు!

- ఆంధ్రరత్న ఎత్తిపోతల పథకంలో సమస్యలు
- పంట కాలువలో చెత్త, మురుగు
- రెండు దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్య
- వ్యవసాయం ఎలా చేయాలంటున్న రైతన్నలు



ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌లో నిలిచిపోయిన చెత్తాచెదారం

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో 16వ జాతీయ రహదారి పక్కన కనకదుర్గ వారధి దగ్గర నుంచి వడ్డేశ్వరం వరకు శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ.. గత 20 ఏళ్ల నుంచి అంచల వారీగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ కనీసం మురుగునీరు, తాగునీరు సరఫరా లేక ఆ ప్రాంత ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఒక్కొక్క ప్లాట్‌ను అధిక ధరలకు కొనుగోలు చేసినా సరైన సౌకర్యాలు లేవంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైపాస్ రోడ్‌లో ఉన్న పలు బహుళ అంతస్తుల్లో మురుగు నీటిని ట్యాంకర్లు.. మోటార్ల ద్వారా ఎత్తిపోసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరికొన్ని అపార్ట్‌మెంట్లు, వ్యాపార సంస్థల నుంచి వచ్చే మురుగు నీటిని పక్కనే ఉన్న ఆంధ్రరత్న, బకింగ్ హామ్ కెనాల్‌లోకి వదిలేస్తున్నారు.

అస్తవ్యస్తంగా పంట కాలువ..

బకింగ్‌హామ్ కెనాల్‌లో నీటి ఒరవడి ఎక్కువగా ఉండడంతో మురుగు నీటిని కాలువలోకి వదలడంతో సమస్య కనిపించడం లేదు. కుంచనపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఆంధ్రరత్న ఎత్తిపోతల పథకం పంట కాలువలో బహుళ అంతస్తుల మురుగు నీరు.. జాతీయ రహదారి వెంబడి వర్షం పడినప్పుడు వచ్చే వర్షపు నీరు ఈ కాలువలో కలుస్తుంది. దీంతో అస్తవ్యస్తంగా కాలువ మారుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు పంట కాలువలో మురుగునీటి సమస్యపై ఆందోళన చేశారు. అప్పట్లో కాలువల్లో పూడిక తీసి తాత్కాలికంగా మరమ్మత్తులు చేశారు. కుంచనపల్లి, ప్రాతూరు, ఓల్డ్ టోల్‌గేట్, గుండిమెడ ప్రాంతాలకు సంబంధించిన మురుగు నీటిని గతంలో ఉన్న మురుగు నీటి కంతకాన్ని అభివృద్ధి చేసి మెల్లెంపూడి వద్ద మురుగు నీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి



పంటకాలువలో నిలిచిన మురుగు

నీటిని శుద్ధి చేసి బకింగ్‌హామ్ కెనాల్‌లో కలపాలని నిర్ణయించారు. కాలక్రమేనా ఆ పథకం కూడా మరుగున పడిపోయింది.

యథేచ్ఛగా కాలువలోకి మురుగు..

అధికారులు గతంలో మళ్లీ సర్వే చేసి ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కట్టను కాంక్రీట్ వాల్‌తో నిర్మించి దాని పక్కనే డ్రైనేజీ నిర్మించాలని అనుకున్నారు. దుగ్గిరాల మండలం వీర్లపాలెం వరకు డ్రైనేజీ నిర్మించి కృష్ణానది వద్ద ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి కృష్ణానదిలోకి దీనిని కలపాలనుకున్నారు. అది కూడా కాగితాలకే పరిమితమైంది. ప్రస్తుతం బైపాస్‌రోడ్ వద్ద 5 నుంచి 9 అంతస్తుల నిర్మాణంలో బహుళ అంతస్తులు పుట్టుకొస్తున్నాయి. ఒక్కో అపార్ట్‌మెంట్‌లో 200 నుంచి 300 ప్లాట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రోజూ 5 నుంచి 10 క్యూసెక్కుల మురుగు నీరు రావడంతో ఆ నీటిని సైతం ఈ కాలువలోకే వదులుతున్నారు. ఫలితంగా సాగునీరు కరువవుతోంది. ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించి ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌లో మురుగునీరు కలువకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



పంట కాలువలో మద్యం సీసాలు, ప్లాస్టిక్ బాటిళ్లు

మురుగు నీటిని పైపుల ద్వారా కాలువలోకి పంపడంతో మద్యం సీసాలు, ప్లాస్టిక్ బాటిళ్లు అధికంగా వస్తున్నాయి. ప్రాతూరు, చిర్రావూరు, గుండిమెడ, రామచంద్రాపురం, వీర్లపాలెంలో సుమారు 2000 ఎకరాలకు ఈ కాలువ ద్వారా నీరు అందుతుంది. ఈ మురుగు నీరుతో సీసాలు సైతం కొట్టుకు రావడంతో అవి పొలాల్లోకి చేరి.. దమ్ము చేసే సమయంలో సీసాలు పగిలి రైతులకు గాయాలు చేస్తున్నాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రావాల్సిన బకాయిలపై కార్మికుల దీక్ష



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని సి.ఐ.టి.యు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. మంగళవారం కార్మికులు నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్షా శిబిరాన్ని వారు సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేసి మాట్లాడారు. కోర్టు తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని.. తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం అడుగుతున్నారని.. ప్రభుత్వం ముందుకు రావాలని కోరుతున్నామన్నారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ఆశీర్వాదం, ఇస్రాయెల్, చరణ్, అంకయ్య, సుభాని, దుర్గా భవాని, ఇమాంబి, సారమ్మ, సువర్ణకుమారి, శివకుమారి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనికి దరఖాస్తు చేసుకోవాలి

ఎంపీడీవో అత్తోట దీప్తి



తెనాలిటౌన్: ఉపాధి హామీ పనికి దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి అత్తోట దీప్తి సూచించారు. మంగళవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద మండల పరిధిలో నాలుగు వేల మందికి ఉపాధి కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలియజేశారు. అయితే ప్రస్తుతం 1500 మందికి మాత్రమే పని కల్పించినట్లు చెప్పారు. అంగలకుదురు, నందివెలుగు, హాఫ్‌పేట, కొలకలూరు, పెదరావూరు గ్రామాల్లో కాల్వలోకి నీరు చేరడం వలన పని కల్పించలేకపోయినట్లు తెలియజేశారు. మేజర్‌మెంట్స్‌కు అనుగుణంగా రోజుకు కనీసం రూ.307లు పనికి వేతనంగా ఇస్తున్నట్లు చెప్పారు. జాబ్‌కార్డు లేకపోతే దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. హౌసింగ్ స్కీం కింద ఇల్లు మంజూరయే గతంలో కట్టుకులేని వారికి ప్రస్తుతం అదనంగా నగదు మంజూరైనట్లు తెలిపారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఇస్తున్నట్లు వివరించారు. మండల పరిధిలో 548 మందికి కేటాయింపులు రాగా 158 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించినట్లు చెప్పారు. జూన్ 18న పూర్తి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. కొలకలూరు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని యుద్ధప్రాతిపదికన గ్రామంలో ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేస్తున్నట్లు వివరించారు.

చిరువ్యాపారిపై మున్సిపల్ ఉద్యోగుల కర్కశం

- హోటల్ సామాను తీసుకెళ్లేందుకు ప్రయత్నం
- కిరోసిన్ పోసుకోవటంతో తాత్కాలికంగా విరమణ

తెనాలి: రోడ్లు ఆక్రమించుకుని యథేచ్ఛగా వ్యాపార దుకాణాలను నిర్వహిస్తున్న ఎందరినో వదిలేసిన మున్సిపల్ పాలకులు దశాబ్దాలుగా హోటల్ నడుపుకుంటున్న చిరువ్యాపారిపై పడ్డారు. ఆయన జీవనోపాధిని దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. ఉపాధి కోల్పోతే తనకు మరణమే శరణ్యమన్న నిర్వేదంతో ఆ చిరువ్యాపారి కిరోసిన్ పోసుకోవటంతో తాత్కాలికంగా ఆగారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణ కొత్తపేటలోని మండల తహసీల్దార్ కార్యాలయం ఉత్తరంపైపు ప్రహరీ వద్ద చిన్న హోటల్ ఎప్పటి నుంచో నడుస్తోంది. ముచ్చల శ్రీరామమూర్తి, నాగమల్లేశ్వరి దంపతులు ఆ హోటల్‌ను నడుపుకుంటున్నారు. నాలుగున్నర దశాబ్దాల క్రితం శ్రీరామమూర్తికి అక్కడ హోటల్ నడుపుకునేందుకు అనుమతినిచ్చారని చెబుతున్నారు. మున్సిపాలిటీకి చట్టబద్ధంగా పన్నులు చెల్లిస్తూ అధికారంగా ఆ హోటల్ కొనసాగుతోంది. ప్రస్తుతం ఆ స్థలం రెవెన్యూ అసోసియేషన్‌కు వెళ్లింది. అక్కడ అసోసియేషన్ కార్యాలయం కోసం నిర్మాణం చేస్తామని, అక్కడ నిర్మించే కాంప్లెక్సులో హోటల్‌కు అనుమతిస్తామని హోటల్ నిర్వాహకులకు చెప్పారు. అప్పటి వరకు తమ సంగతేంటన్న ప్రశ్నకు సమీపంలోని బాలుర హైస్కూలు గోడ పక్కన తాత్కాలికంగా నిర్వహించుకోవాలని అధికారులు సూచించారు. ఆ ప్రకారం హోటల్‌ను ఏర్పాటు చేసుకుంటున్న క్రమంలో మంగళవారం వెంకట్రామయ్య అనే మున్సిపల్ ఉద్యోగి, సిబ్బందితో సహా వచ్చి సామాన్లు వాహనంపైకి ఎక్కించారు. దీంతో జీవనోపాధి పోతుందన్న నిరాశతో శ్రీరామమూర్తి వంటిపై కిరోసిన్ పోసుకోవటంతో సామాన్లు వదిలేసి వెళ్లారు. కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయి తమకు షాపు కేటాయించేవరకు హోటల్ నిర్వహణకు అనుమతించాలని ఆ దంపతులు ప్రాధేయపడుతున్నారు.

చిన్నారులకు వేసవి విజ్ఞాన శిబిరం



నెక్కల్లు(తాడికొండ): బడిబాటలో భాగంగా తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎన్రోల్‌మెంట్ డ్రైవ్, వేసవి విజ్ఞాన, వినోద శిబిరాన్ని నిర్వహించినట్లు హెచ్‌ఎం సీహెచ్ ఆదినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శాస్త్రీయ అంశాలపై అవగాహన కల్పించారు. చిన్నారులు చేసిన కాగితపు బొమ్మలను జన విజ్ఞాన వేదిక ప్రతినిధి వల్లభాపురం ప్రసాద్ ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ సభ్యులు డి.అప్పారావు, ఉపాధ్యాయులు పి.దేవకి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు తెనాలి శిల్పాలు



తెనాలి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే నెల 2వ తేదీన అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవం కోసం రానున్న సందర్భంగా బహిరంగసభా వేదిక వద్ద ప్రదర్శించేందుకు అమరావతి అక్షరాలతో కూడిన భారీ పెడస్టల్ని తెనాలి శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర తీర్చిదిద్దారు. ఇనుప వ్యర్థాలతో చేసిన పెడస్టల్‌కు అమరావతి అక్షరాలను ఐరన్ స్క్రాప్‌తో రూపొందించారు. ఒకవైపు గౌతమ బుద్ధుడి ఐరన్ స్క్రాప్ విగ్రహం, ఆ పక్కనే నరేంద్రమోదీ ఫైబర్‌గ్లాస్ విగ్రహం, స్టెయిన్ లెస్ స్టీల్‌తో చేసిన మేకిన్ ఇండియా సింహం విగ్రహాన్ని రూపొందించారు. మరోవైపు ఎన్టీఆర్ ఐరన్ స్క్రాప్ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఉంచిన పెడస్టల్, విగ్రహాలను కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి మంగళవారం సందర్శించారు. ప్రధానమంత్రి బహిరంగ సభావేదిక వద్ద వీటిని ప్రదర్శించేందుకు సృజనాత్మకత, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు సహకరించినట్టు శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు చెప్పారు.

కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న కేంద్రం



సమావేశంలో పలు కార్మిక సంఘాల నాయకులు

మంగళగిరి టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని సి.ఐ.టి.యు కార్యాలయంలో మంగళవారం పలు కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ, సీఐటీయూసీ, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు హాజరయ్యి మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులకు నష్టం కలిగించే మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా రైతులు ప్రాణాలు అర్పించి రద్దు చేయించారని గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వర్గాలు పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసిందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న మోడీ ప్రభుత్వానికి సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మే 17వ తేదీన బైక్ ర్యాలీ నిర్వహించాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్.నాగరాజు, డి.అమరేశ్వరరావు, రత్నాకం శ్రీనివాసరాజు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ నాయకుల బుచ్చిబాబు, శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు బాలాజీ, చెంగయ్య, ఏఐటీయూసీ నాయకులు ప్రభాకర్, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమరావతి పరిరక్షణ కమిటీ ఛైర్మన్ నియామకం



చిలకా విజయ్‌కుమార్

తాడికొండ: అమరావతి పరిరక్షణ కమిటీ ఛైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల తమను నియమించారని గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకా విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుగురితో కూడిన కమిటీని నియమించగా ఆ కమిటీకి తాను నాయకత్వం వహించనున్నారని.. రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యలపై అధ్యయనం చేస్తూ నిత్యం వారి సమస్యలను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు. అమరావతి రైతు సమస్యలపై కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి అండగా ఉందని.. 2015 నుంచి అసైన్డ్ భూములపై, 2019 నుంచి మూడు రాజధానుల విధానంపై ప్రభుత్వాలపై పోరాడిందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వంలో అమరావతి రైతుల్లో కొంత గందరగోళం నెలకొందని.. దానికి నిదర్శనమే ఇటీవల సీఆర్డీయే నియమించిన రైతు కమిటీతో పాటు ప్రధాని చేతుల మీదుగా కొంతమంది రైతులను సన్మానానికి ఎంచుకున్న విధానమని విమర్శించారు.

మే డే వేడుకలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల కాశయ్య

తాడేపల్లి రూరల్: మే 1వ తేదీన నిర్వహించనున్న మే డే వేడుకలను జయప్రదం చేయాలని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బి.జె.పి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని మండిపడ్డారు. కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని.. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న తలపెట్టిన అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. మే 1వ తేదీన తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే మే డే వేడుకల్లో అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్

- 16 ఏళ్ల సమస్యకు చెక్ పెట్టిన వైద్యులు
- కోత, కుట్లు లేని ల్యాప్రోస్కోపి ఆపరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

గుంటూరు మెడికల్: కామెర్ల సమస్యతో 16 ఏళ్లుగా బాధపడుతున్న మహిళకు గుంటూరు జీజీహెచ్ వైద్యులు కోత, కుట్లు లేని ల్యాప్రోస్కోపి ఆపరేషన్ చేసి సమస్యకు చెక్ పెట్టారు. మంగళవారం గుంటూరు జీజీహెచ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా బందర్‌కు చెందిన 44 సంవత్సరాల నాంచారమ్మకు 16 సంవత్సరాల క్రితం కామెర్ల వ్యాధి సోకింది. స్థానిక ప్రైవేటు వైద్యులు ఆమెకు వైద్యం చేసి మెరుగైన చికిత్స కోసం మరో కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి వైద్యులు ఆటోఇమ్యూనో డిసీజ్ అని నిర్ధారణ చేశారు. 15 ఏళ్లుగా మందులు వాడుతూనే ఉంది. చికిత్స కోసం ఖర్చు భరించలేక జీజీహెచ్‌లో చేరారు. తొలుత గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు పసరునాళంలో రాయిని తీసి, స్టంట్ వేసినట్లు వివరించారు. పసరు తిత్తు, బల్ల సమస్య కోసం తమ వద్దకు రిఫర్ చేశారన్నారు. ఎలాంటి కోత, కుట్లు లేకుండా బటన్ హోల్ ల్యాప్రోస్కోపి ఆపరేషన్ ద్వారా పసరుతిత్తి, ఉబ్బిన బల్లను (స్లీన్) విజయవంతంగా ఒక్క ఆపరేషన్‌తో తొలగించామన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతోపాటు, జనరల్ సర్జరీ వైద్యులు నాగ సంతోష్‌కుమార్, సాధిక్ బాషా, వేణుగోపాల్, మేఘన, అవిన్, హరి, మత్తు వైద్యులు పోలయ్య, శ్యామ్‌సన్, స్వేత, రిచి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు కవిత, నాగూర్‌బాషా, శివరామకృష్ణ, అనిల్, నవీన్ పాల్గొన్నట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ వివరించారు. ఆపరేషన్ విజయవంతమయ్యేందుకు సహకరించిన జనరల్ సర్జరీ విభాగాధిపతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ చేసి 16 ఏళ్ల రోగి సమస్యను నయం చేసిన జనరల్ సర్జరీ వైద్యులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అభినందనలు తెలిపారు.

ఉర్దూ భాషతో ఉజ్వల భవిష్యత్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉర్దూ డీఐ ఖాసిం, ఉర్దూ అకాడమీ సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: ఉర్దూ భాషతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గుంటూరు ఉర్దూ షేక్ మొహమ్మద్ ఖాసిం పేర్కొన్నారు. ఉర్దూ భాషాభివృద్ధిలో భాగంగా గుంటూరులోని ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉర్దూ భాష ప్రాముఖ్యత, విద్య, ఉద్యోగావకాశాలపై రూపొందించిన పోస్టర్లను మంగళవారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉర్దూ డీఐ ఖాసిం మాట్లాడుతూ ఉర్దూ భాషతో ఉజ్వల భవిష్యత్ ఉందని, ఉర్దూ భాష ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ఉర్దూ భాషతో భారతదేశానికి విడదీయరాని అనుబంధం ఉందని, ఉర్దూ కేవలం ముస్లింల భాష కాదని, అది భారతీయుల భాష అని చెప్పారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఉర్దూ మాధ్యమంలో చదివిన ఎంతో మంది అత్యున్నత పదవుల్లో రాణిస్తున్నారని అన్నారు. ప్రాథమిక, ఉన్నత విద్యను ఉర్దూ మాధ్యమంలో చదివిన ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ సహా ఉన్నత ఉద్యోగాలు, ఉన్నత కేడర్లలో ఉన్నారని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉర్దూ మాధ్యమంలో చదివించే దిశగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ కార్యాలయ సిబ్బంది షేక్ అక్బర్, ఫక్రుద్దీన్ అలీ, నయీమ్, రఫీ, అబ్దుల్లా ఖాన్, మెహబూబున్నీసా, మల్లికా సుల్తానా మరియు నాగూర్‌బాషా పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

రేపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, బాపట్ల ఆధ్వర్యంలో ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో పలు కోర్సులలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సి.రవి చంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులకు స్కిల్ హబ్ సెంటర్‌లో పరిశ్రమలకు అనుగుణంగా శిక్షణ అందించి, అనంతరం అభ్యర్థులకు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థల నుంచి సర్టిఫికెట్ అందించబడునన్నారు. అర్హతలను బట్టి అభ్యర్థులకు ఆయా కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడునని తెలియజేశారు. శిక్షణకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి, ఇంటర్, ఏదైనా డిగ్రీ ఆ పైన చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్ డెవలపర్, అకౌంట్స్ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9347468946ను సంప్రదించాలన్నారు.

కిల్కారి కాల్ సేవలపై అవగాహన

మేడికొండూరు: గర్భిణులు, బాలింతలకు ఉపయోగపడే కిల్కారి కాల్ సేవలపై మంగళవారం ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని మందపాడు గ్రామ ప్రాథమిక వైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి రాజు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాంను గర్భిణులు, బాలింతల కోసం ప్రవేశ పెట్టిందని అన్నారు. కిల్కారి కాల్ ద్వారా తల్లి, బిడ్డలకు ఆరోగ్య సమాచారాన్ని అందిస్తారని పేర్కొన్నారు. కిల్కారి వాయిస్ కాల్స్ వారానికి ఒకసారి వస్తాయని.. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తిగా సమాచారాన్ని తెలుపుతారని అన్నారు. తిరిగి ఆ సమాచారాన్ని వినాలంటే 14423 అనే టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి వినవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.పద్మలత, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పి.హెచ్.ఎన్.ఎం గిరిజ, ఎంపీఈవో అశోక్ కుమార్, హెచ్ ఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.